క్లుప్తంగా

సంబరంగా భోగి పళ్ల ఉత్సవం


చిన్నారికి భోగి పళ్లు పోస్తున్న దేవస్థానం ఈవో త్రినాథరావు దంపతులు

సింహాచలం: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహగిరిపై సోమవారం చిన్నారులకు భోగి పళ్లు పోసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నృసింహ మండపంలో పలువురు చిన్నారులకు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు దంపతులు భోగి పళ్లు పోశారు. అర్చకులు చిన్నారులను ఆశీర్వదించారు. ఉదయం 9 గంటల నుంచి జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకొచ్చి, భోగిపళ్లు పోయించారు.

అప్పన్నకు తొలి పంట సమర్పణ


తలపై గుమ్మడికాయలు పెట్టుకుని స్వామికి సమర్పించేందుకు వస్తున్న మహిళలు

సింహాచలం: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తొలి పంటను కానుకగా సమర్పించారు. వరి దుబ్బులు, బియ్యం, కూరగాయలు, నూనె, పాలు, పెరుగు, వెన్న, పంచదార, పప్పుదినుసులను భక్తిశ్రద్ధలో అందించారు. కరవుకాటకాలు రాకుండా ఏటా తమ వ్యవసాయ క్షేత్రాలు ఫలాలనందించాలని స్వామిని వేడుకున్నారు. పలువురు గ్రామీణ ప్రాంతాల భక్తులు గరిడీ బృందాలతో తరలివచ్చి స్వామికి మొక్కుచెల్లించారు. ఉదయం ఐదు గంటల నుంచి మొదలైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. ఎటుచూసినా సింహగిరి భక్తజన సంద్రంగా మారింది. దర్శన క్యూలు, ప్రసాద విక్రయాల భక్తులతో కిక్కిరిశాయి. సింహగిరిపైన, సింహగిరి ఘాట్‌రోడ్డులోను ట్రాఫిక్ రద్దీ నెలకొంది.

వీఆర్‌ఎస్ పత్రాలు భోగి మంటల్లో దహనం

ఉక్కునగరం: ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు యాజమాన్యం విడుదల చేసిన స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్‌ఎస్) పత్రాలను దహనం చేశారు. ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగంగానే వీఆర్‌ఎస్ జారీ చేశారని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కంటే సెయిల్‌లో ఎక్కువగా సిబ్బంది ఉన్నప్పటికీ స్టీల్‌ప్లాంట్‌పై కక్షతో ఉక్కు మంత్రిత్వశాఖ వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఇందులో భాగంగానే నాలుగు నెలలుగా జీతాలు అందించకుండా వేధిస్తున్నారన్నారు. కూటమి ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డి. ఆదినారాయణ, జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, రమణమూర్తి పాల్గొన్నారు.

క్రికెట్ విజేత ఢిల్లీ డేర్ డెవిల్స్


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న గ్రామ పెద్దలు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ మద్దిలపేటలో కనకల వెంకటేష్ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఢిల్లీ డేర్ డెవిల్స్ జట్టు నిలిచింది. ఈ సందర్భంగా విజేత జట్టుకు జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు మద్దిల వెంకటరమణ, కనకల గోవింద్, కనకల అప్పలనారాయణ, మద్దిల ఆదినారాయణ, బోని రామకృష్ణ, మద్దిల వెంకట శివకుమార్, మద్దిల శివ, కాళ్ల సన్నిబాబు, మద్దిల గురునాథ్ తదితరులు సోమవారం ట్రోఫీ ప్రదానం చేశారు. మద్దిల సూరిబాబు కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారు.


ఆర్కే బీచ్‌లో పతంగులు ఎగురవేస్తున్న సందర్శకులు

పద పదవే గాలిపటమా!



పంచవన్నెల పతంగులకు మాంజా దారం కట్టి, ఆకాశంలోకి ఎగరేస్తుంటే.. ఎవరికైనా తామే ఆకాశంలో ఎగురుతున్నంత ఉత్సాహం కలుగుతుంది. ఇంద్రధనుస్సు రంగుల్లా వైవిధ్యంగా రూపుదిద్దుకున్న గాలిపటాలను సంక్రాంతి పండగ రోజుల్లో పెద్దలు, పిల్లలతో పోటీ పడుతూ ఎగరేస్తారు. 'పద పదవే ఒయ్యారి గాలిపటమా!' అని సముద్రాల వారు చెప్పినట్లు.. ఆకాశంలో పక్షిలాగా ఎగిరే ఈ గాలి పటాల పండగ కోసం విశాఖ సాగరతీరం సిద్ధమైంది. ఇప్పటికే కొందరు ఆర్కే బీచ్ వేదికగా పతంగుల పండగకు శ్రీకారం చుట్టారు.

-ఏయూక్యాంపస్



- బీచ్‌రోడ్డులో రంగురంగుల పతంగులు
- పదుల సంఖ్యలో విక్రయ దుకాణాలు
- ఆర్కే బీచ్ వేదికగా గాలిపటాల పండగకు శ్రీకారం

సంక్రాంతి పండగ అంటే గాలిపటాలు అనే నానుడి ఏర్పడింది. దీనికి అనుగుణంగానే గాలిపటాలను విక్రయించే దుకాణాలు సైతం పెరిగిపోయాయి. నేడు రూ.15 నుంచి నాలుగు వేల రూపాయలు విలువ చేసే పతంగులు సైతం అందుబాటులోకి వచ్చాయి. సాధారణ పతంగులను స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారు. ఆధునికంగా విభిన్న రంగులు, ఆకారాలలో వస్తున్న పతంగులను అహ్మదాబాద్ నుంచి స్థానిక వ్యాపారులు తీసుకువచ్చి విక్రయాలు చేస్తున్నారు. ఈ సంవత్సరం పండగలకు ముందు, వెనుక సెలవులు కలిసి రావడంతో పతంగులు ఎగురవేసే పనిలో చిన్న, పెద్ద మునిగిపోయారు.

చరకా రూ 70...

గాలిపటం ఎగరవేయడానికి ప్రత్యేకమైన దారం కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ గాలిపటం ఎగురవేయడానికి అవసరమైన దారాన్ని వదలడానికి ప్రత్యేకంగా చరక వినియోగిస్తారు. చెక్కతో తయారు చేసినది రూ.70, స్టీలుతో తయారు చేసిన చరకాను రూ.120 విక్రయిస్తున్నారు. పెద్ద గాలి పటాలకు అవసరమైన భారీ చరకాలు మరింత ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

పతంగులు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. చిన్నారులు తప్పనిసరిగా పెద్దల పర్యవేక్షణలో వీటిని ఎగురవేయడం మంచిది. ఇంటి పై భాగంలో, మేడమీద పతంగులు ఎగురవేసే సమయంలో మరింత జాగ్రత్తలు వహించాలి. గోడలు ఎక్కడం, భవనం పైకి ఎక్కడం, ప్రమాదకరంగా విన్యాసాలు చేయడం మానుకోవాలి. ప్రహరీ లేని భవనాలపై ఎట్టిపరిస్థితుల్లోనూ పతంగులు ఎగురవేయకూడదు. విద్యుత్ తీగలను,చెట్లపై చిక్కుకున్న పతంగులను తీయాలనే ప్రయత్నం మంచిది కాదు. చిన్న పొరపాటు జరిగినా తీవ్ర ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. విశాలమైన ఖాళీ ప్రదేశంలో మాత్రమే పతంగులు ఎగురవేయాలి. సాగర తీరంలో పతంగులు ఎగురవేసే సమయంలో ఇవి రహదారిపైకి రాకుండా చూసుకోవాలి. రోడ్డు పైకి పతంగులు వస్తే వాహన చోదకులకు అడ్డుగా మారే అవకాశం ఉంది. ఇది వాహన చోదకులకు ప్రమాదాలకు గురిచేసే ప్రమాదం ఉంది. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పతంగులను ఎగరవేస్తూ, పండగను జరుపుకోవాలి.


గరుడ పక్షి ఆకారంలో..




వివిధ ఆకారాల్లో పతంగులు

బీచ్‌రోడ్డులో దుకాణాలు

బీచ్ రోడ్డులో వైఎంసీఏ నుంచి ఆర్.కె బీచ్ వరకు దాదాపు 30 వరకు తాత్కాలిక పతంగుల దుకాణాలు అందుబాటులోకి వచ్చాయి. వీరు ఈ వారం రోజులు వివిధ రకాల పతంగులను విక్రయించనున్నారు. గరుడ పక్షి, గబ్బిలం, యాంగ్రీ బర్డ్, బటర్ ఫ్లై, ఎవెంజర్, రంగురంగుల దీపాలు, సినిమా నటులు తదితర ఫొటోలతో ఆకర్షణీయమైన పతంగులు ఇక్కడ అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా విభిన్న కార్టూన్ పాత్రల చిత్రాలతో కూడిన గాలిపటాలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు.


పతంగులు కొనుగోలు చేస్తున్న చిన్నారులు

కోలాహలంగా సంక్రాంతి సంబరాలు



మ్యూజికల్ నైట్‌లో కళాకారుల ప్రదర్శన

- శాస్త్రోక్తంగా భోగి పూజలు
- వేడుకల్లో పాల్గొన్న సినీనటుడు సాయికుమార్
- ఉర్రూతలూగించిన సాంస్కృతిక కార్యక్రమాలు


డ్యాన్స్ చేస్తున్న యువతీ యువకులు

విశాఖ విద్య : ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్ జరుగుతున్న జీవీఎల్ మహా సంక్రాంతి సంబరాలు కోలాహలంగా సాగుతున్నాయి. రెండో రోజు సోమవారం భోగి పండగ పర్వదినం సందర్భంగా తెల్లవారు జామున 5.30 గంటలకు అత్యంత వైభవంగా భోగి నిర్వహించారు. భారీ జన సమూహం నడుమ రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు, మైథిలి దంపతులు, అదే విధంగా ప్రముఖ సినీ నటులు సాయికుమార్ దంపతులు భోగి మంట వెలిగించారు. సాయంత్రం భోగిపళ్ల వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రాంగణం హోరెత్తింది. ప్రముఖ వర్ధమాన గాయకులు ఆలపించిన గీతాలు ఆద్యంతం జోష్‌నింపాయి. మేజిక్ షో, స్పెషల్ డ్యాన్స్ యువతను ఉత్తేజపరిచాయి. ఇండియన్ తెలుగు ఐడల్ పవన్, సాయి, కావాక్షి బాండ్ ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది.


సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న జీవీఎల్ నర్సింహరావు, నటుడు సాయికుమార్

భోగభాగ్యాల భోగి


ఏయూ అవుట్ గేట్ వద్ద భోగిమంట


ఈస్ట్‌పాయింట్ కాలనీలో డూడూ బసవన్నలు


కిర్లంపూడి లే అవుట్ వద్ద..

ఏయూక్యాంపస్ : భోగ భాగ్యాలను అందించే భోగి పండగను విశాఖ వాసులు ఘనంగా జరుపుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సందడిగా చేశారు. తూర్పు నియోజకవర్గంలో ప్రతి వీధిలో భోగి మంటలు వేసి తమ సంప్రదాయాన్ని కొనసాగించారు. ఉదయాన్నే చిన్నారులు కొత్త బట్టలు వేసుకుని భోగి మంటల వద్దకు వచ్చారు. వివిధ జానపద గీతాలను ఆలపిస్తూ గంగిరెద్దుల వారు వీధుల్లో పండగ కళ తీసుకొచ్చారు. పలు చోట్ల హరిదాసుల గానం కూడా కనువిందు చేసింది. ఇళ్ల వద్ద రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం



- పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు
- ఆలయాలలో ప్రత్యేక పూజలు


అమ్మవారి మంగళసూత్రాలు చూపుతున్న పురోహితులు


అన్నదానం చేస్తున్న శ్రీ కృష్ణ యాదవ సంఘం సభ్యులు

ఏయూక్యాంపస్: నగరానికి పండగ కళ వచ్చింది. సోమవారం ఉదయం భోగిమంటలతో గడిపి..అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాలను దర్శించుకున్నారు. పిల్లలు కొత్త బట్టలు వేసుకుని సందడి చేశారు. పండగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ధనుర్మాసంలో చివరి రోజైన భోగి రోజున గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. బీచ్‌రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో ఉదయం గోదా కల్యాణం భక్తుల సమక్షంలో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వి.శ్రీరామ మూర్తి పర్యవేక్షణలో పండితుల వేద మంత్రాల నడుమ శ్రీ గోదా రంగనాథుల కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమాన్ని ఆలయ మేనేజర్ దేవుళ్ల పర్యవేక్షించారు. చినవాల్తేరులోని శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం జరిపించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పండితు సమక్షంలో ఈ కార్యక్రమం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు గోదాకళ్యాణం వీక్షించారు. కిర్లంపూడి లే అవుట్‌లోని లలిత సుందరేశ్వర పీఠంలో పౌర్ణమి, ఆరుద్ర నక్షత్రం, సోమవారం కలిసి రావడంతో ఉదయం సుందరేశ్వర స్వామి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిపించారు. సాయంత్రం లలితా దేవికి పంచామృత అభిషేకం చేశారు. కార్యక్రమంలో భక్తులు స్వయంగా పాల్గొని అభిషేకాలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి లక్ష్మణస్వామి భక్తులచే అభిషేకాలు జరిపించారు. భోగి పండుగను పురస్కరించుకుని శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో చినవాల్తేరులో అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం చినవాల్తేరు ప్రధాన రహదారిలో జగన్నాథస్వామి ఆలయం వద్ద నిర్వహించిన అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పీతల అమరేంద్ర, పంచదార్ల శ్రీనివాస్, పీతల అవినాష్, మూర్తి, రాము, బొట్ట సాయి కుమార్, శ్రీను,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారంపై నిరసన

ఏయూక్యాంపస్: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలను తక్షణం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. భోగి పురస్కరించుకుని బి.ఎస్.ఆర్ నగర్‌లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గతంలో టీడీపీ, జనసేన ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీల పెంపుపై బాదుడే బాదుడు అంటూ ఉపన్యాసాలు ఇచ్చారని, నేడు వీరే చార్జీలు అధికంగా పెంచి భారం మోపడం ఎంతవరకు సమంజసమన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే మొదట తాను తగలబెడతానని లోకేష్ అన్న మాటలు మరచిపోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి రూ.16 వేల కోట్ల విద్యుత్ భారం మోపడం సరైన నిర్ణయం కాదన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టడం వలన ప్రజలపై మరింత అధిక భారం పడుతుందన్నారు.

ఈ ఏడాది సంక్రాంతి కానుకగా కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల పెంపు భారాన్ని మోపిందని ఆరోపించారు. కార్యక్రమంలో పి.నాగమణి, జి.నాగరాజు, జి.లక్ష్మీ నారాయణ, సి.హెచ్ రాము,గ్రామ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ బిల్లులను భోగిమంటలో వేస్తున్న నేతలు